**కథ**

**జీవితంలో సక్సెస్...అహంకారం... అభిజాత్యం... మనుషులు పొరపాట్లు చెయ్యటానికి ఇవే కారణాలైతే నేనూ ఈ కారణాలచేతనే ఒక పొరపాటు చేసాను.**

# అంచనా తప్పింది

ఒక వ్యక్తి..ఆ వ్యక్తి నా సంతోషపు జీవితంలో ముల్లులా కదుల్తుంటాడు. అతన్ని తలుచుకుని పద్మజ దిగులుపడుతుంది. అతను జ్ఞాపకానికొస్తే ఉదాశీనంగా వుంటుంది. ముభావాన్ని ముసుగేసుకుంటుంది.

అతను... నాకొక పెద్ద సమస్యే. అతను..పద్మజ తండ్రి. పద్మజ? నా భార్య.

★ ★ ★

బ్యాంకాఫీసరుగా రిటైరయ్యాను. పదిహేను లక్షలకి పైగా వచ్చాయి రిటైర్మెంటు బెనిఫిట్సు. బాధ్యతల్లేవు. ఉన్న యిద్దరు కూతుళ్ళకీ సర్వీసులో వుండగానే పెద్ద చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేసాను. అమ్మా, నాన్న గగన్‌విహార్ ఎపార్ట్‌మెంట్సులో ఫ్లాట్ తీసుకుని యిండిపెండెంటుగా వుంటారు. తమ్ముడిది పక్క ఫ్లాటే. వాళ్ళని చూసుకుంటాడు. నేను, పద్మజ-యిద్దరమే యిప్పుడు.

డబ్బుని ఏం చెయ్యాలాని ఆలోచించాను.

కూతుళ్ళిద్దరికీ చెరో లక్షా గిఫ్టుగా యివ్వచ్చు. ఇంకా? చిన్నప్పుడు నాకు లెక్కలు చెప్పిన మాష్టారింకా బ్రతికే వున్నారు. కొడుకులు పట్టించుకోరట. దయనీయంగా బతుకుతున్నారు. వెళ్ళి పదివేలు యిచ్చి వచ్చాను. ఆయన కళ్ళు కృతజ్ఞతతో మెరవటాన్ని నేను మర్చిపోలేను.

ఆ తర్వాత?

ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. జీవితంలో సక్సెసైన వ్యక్తిని గాబట్టి నా సిద్ధాంతాలు నాకున్నాయి. వాటి వెంబడే అహంకారం, అభిజాత్యం. ఆ ఆలోచన తప్పనిపించలేదు.

పద్మజని పిలిచాను. పన్లో వున్నట్టుంది, నేప్కిన్‌తో చేతులు తుడుచుకుంటూ వచ్చి కూర్చుంది.

''వంటా?'' అడిగాను తను చేస్తున్న పని గురించి.

''ఐపోయింది. ఇడ్లీపిండి గ్రైండ్ చేస్తుంటే పిలిచారు. దేనికి?''

''చూడు, నీకు కాలేజీలో చదువుకునేటప్పుడు యాంబిషన్సేం వుండేవికావా?'' నేను చెప్పబోయే విషయానికి ఒక ఫ్రేమ్ తయారుచేస్తూ అడిగాను.

''ఇప్పుడెందుకవన్నీ?'' అడిగింది పద్మజ. నేను పిలిచినది అంత ముఖ్యమైన విషయం కాదనుకున్నట్టుంది- రిలాక్స్‌డ్‌గా కూర్చుంది. కబుర్లు వినడానికన్నట్టు.

''ఎమ్మెస్సీ చదివి లెక్చరరవ్వాలని వుండేది. మా నాన్న వినలేదు. ఇంట్లో పెద్దదానివి. నిన్నే ఎమ్మెస్సీ అనీ పీహెచ్‌డీ అనీ పాతికేళ్ళదాకా వుంచేస్తే నీ తర్వాతి వాళ్ళకి పెళ్ళిళ్ళెప్పుడు చెయ్యాలని కోప్పడ్డారు''

''పెళ్ళయ్యాక నువ్వెప్పుడూ నాతో అనలేదు చదువుకుంటానని'' ఆరోపించాను.

''నిజమే. మొదట్లో అత్తింటికాపురం. తర్వాత వెంట వెంటనే పిల్లలు పుట్టడం. ఐదారేళ్ళపాటు ఏదీ ఆలోచించడానికి వీల్లేకుండా వుండేది లైపు. ఆ తర్వాత ఆసక్తిపోయింది''

''పెళ్ళి గురించి నువ్వేం అనుకోలేదా? కట్నం యివ్వకూడదనీ... ఇలా..జనరల్‌గా, ఆడవాళ్ళకి కట్నం యివ్వకుండా చేసుకోవాలని వుంటుందటగా?''

''నాకంత ఆలోచనలేం లేవు. మా నాన్న యివ్వాలనుకున్నాడు. యిచ్చాడు. అంతే. నా సుఖం కోసం యిచ్చాడు''

''కట్నం తీసుకోవడం నాకెప్పుడూ యిష్టం వుండేది కాదు తెలుసా?''

''మరెందుకు తీసుకున్నారు?'' తను నవ్వుతూనే అడిగినా చురుక్కుమంది.

''మా నాన్న పడనివ్వలేదు. నా చదువుకి చాలా ఖర్చైంది. నా తర్వాత తమ్ముడున్నాడు. వాడి చదువు, యిద్దరు చెల్లెళ్ళ పెళ్ళి... నా చదువుకి పెట్టిన ఖర్చు తిరిగిచ్చేస్తే నేను కట్నం తీసుకోకపోయినా అడగనన్నాడు. అంత డబ్బెక్కడి నుంచీ తేను?''

''అందరికీ ఏవో ఒక కారణాలుంటాయిలెండి. తీసుకునే వీలున్నప్పుడు తీసుకోకుండా వుండేందుకు ఎవరూ చూడరు. తీసుకుని సమర్థించుకోవడానికి కారణాలు వెతుక్కుంటారంతే''

''అలా అందర్తోటీ నన్ను కలిపెయ్యకు. తీసుకున్నాక యింకా ఫిషయాన్ని వదిలేస్తారు చాలామంది. తీసుకున్న దానికి కొసర్లు వేయించుకుంటారు యింకొంతమంది. నా వరకూ నాకు కట్నం తీసుకున్నందుకు చాలా బాధగా వుంటుంది. ఇన్సల్ట్‌గానూ అనిపిస్తుంది.''

''ఐనా తీసేసుకున్నారు. అందరూ చేసే పనే మీరూ చేసారు. లోకవిరుద్ధంగా చేస్తే బాధపడాలి. లోక సహజమైనదానికెందుకు? పరిణామాలెప్పుడూ మీకు అనుకూలంగానే వుంటాయిగా మరి?''

''నీకు తెలీదులే పద్మజా! ఈ ముప్పయ్యైదేళ్ళలోనూ నేనెంత బాధపడ్డానో! ఎప్పటికేనా మీ నాన్నకా డబ్బు తిరిగిచ్చేయాలనుకునేవాడిని. ఎప్పటికప్పుడు ఏవో ఖర్చులు''

పద్మజ నవ్వింది. ఆ నవ్వులో అదోలాంటి విరుపు.

''ఐదంకెల్లో కట్నం తీసుకుంటూ కోటీశ్వరుల జాబితాకి సగం దూరంలో వున్న నేనలా అనడం అసంబద్ధంగా వుండచ్చుగానీ ఎంతచెట్టుకంతగాలి? ఒక పని చేస్తే బాగుంటుందనిపిస్తోంది. పెళ్ళప్పుడు మీ నాన్నిచ్చిన యాభైవేలకీ మరో యాభైవేలు కలిపి తిరిగిచ్చేద్దామనుకుంటున్నాను. ఇదిగో చెక్కు. కొరియర్లో పంపించి వస్తాను'' అన్నాను లేస్తూ.

పద్మజ నా ముఖంలోకి తదేకంగా చూస్తూ వుండిపోయింది. ఏదో చెప్పబోయి ఆగిపోయింది. తన పెదాలమీది నవ్వు కూడా ఎగిరిపోయింది.

రెండురోజుల క్రితం కూడా ఇలాగే ఏదో చెప్పబోయి ఆగిపోయింది. అంతక్రితం ఒకసారి. దానికి ముందు మరొకసారి..నాలుగైదుసార్లు యిలాగే జరిగిందీమధ్య. తనకి నా దగ్గర సంకోచం వుంటుందని నేననుకోను. చెప్పదగినదైతే తనే చెప్తుందని వూరుకున్నాను. ఇప్పుడూ అంతే!

నేను తిరిగొచ్చేసరికి తను కిచెన్లో వుంది. ముఖం భావరహితంగా వుంది. ఎప్పుడూ పెదాలమీద మెరిసే చిరునవ్వు లేదు. ఆలోచించాను. తనిలా వున్న సందర్భాలు గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేసాను.

పద్మజకి ముగ్గురు చెల్లెళ్ళు. మా పెళ్లైన మూడేళ్ళకి పెద్ద చెల్లెలికైంది. ఆ సమయంలో మేము కొంత సాయం చేస్తే బావుంటుందనే భావాన్ని వ్యక్తం చేసింది తను.

''ఆడపిల్ల పెళ్ళికున్నప్పుడు మీ నాన్న ఏదో ఒక ఏర్పాటు చేసుకోడా? చేసుకోకుండానే పెళ్ళి సన్నాహాల్లో వుంటాడా?'' అని నేను కొట్టిపారేసిన సందర్భం ఒకటి-

పద్మజ తల్లి చనిపోయింది. తర్వాత ఆఖరి చెల్లెలి పెళ్ళి చేసారు. తండ్రిని మా దగ్గరకి తెచ్చుకుంటే

బావుంటుందని పద్మజ అంది.

''మనకేనా బాధ్యత? మీ చెల్లెళ్ళిద్దరికి వుండదా?'' అని నేనన్న సందర్భం మరొకటి-

ఇలా వరసగా కొన్ని గుర్తొచ్చాయి నాకు. మరిప్పుడు? నలుగురాడపిల్లల పెళ్ళిళ్లు చేసి, అన్నివిధాలా చితికిపోయి వోల్డేజి హోమ్‌లో వుంటున్న ఆయనకి డబ్బు పంపిస్తే కూడా ఎందుకిలా వుండటం? అడగడానికి ఇగో అడ్డొచ్చింది.

★ ★ ★

అనూహ్యంగా నేను పంపించిన చెక్కు తిరిగి వచ్చింది. మొదట డెలివరీకాక తిరిగొచ్చిందేమోననుకున్నాను. కానీ పద్మజ తండ్రి దస్తూరీ వున్న కవర్లో వచ్చింది. దాంతోపాటే చిన్న వుత్తరం.

క్షేమ సమాచారాలు, ఆశీస్సులు షరామామూలే. వాటితోపాటు-

రాలిపోవడానికి సిద్ధంగా వున్న పండుటాకుని, నాకెందుకయ్యా, లక్షలు? ఈ పెద్ద వయసులో మనశ్శాంతి లేకుండా చెయ్యటానికి కాకపోతే? నువ్విచ్చినదాన్ని తిప్పి పంపిస్తున్నాననుకోకు. పద్మజకి కానుగ్గా యిస్తున్నానని తీసుకో-

అనుంది.

ఉన్న డబ్బుల్తో పెద్దకూతురికీ, అప్పుల్తో రెండో కూతురికీ చేసి, రిటైర్మెంటు బెనిఫిట్సుతో అప్పులు తీర్చి మూడో కూతురికి చేసి, కేన్సరుతో తీసుకున్న భార్యకోసం యింటిమీద అప్పు చేసి, ఆవిడ్ని సాగనంపి, యిల్లమ్మి నాలుగో కూతుర్ని అంపకం పెట్టి, దిక్కూ మొక్కూ లేకుండా పెన్షను డబ్బుల్తో కాలం వెళ్ళదీస్తున్న ఆ ముసలాయన చేసిన పని నాకు చాచిపెట్టి చెంపదెబ్బ కొట్టినట్లైంది.

అతడి వల్ల పద్మజకి విచారం, దుఃఖం..నాతో వున్నప్పుడు ముభావం, వుదాశీనతాను.

నేను పదివేలిస్తే ఎంతో సంతోషంగా తీసుకున్న లెక్కల మాష్టారు గుర్తొచ్చారు. ఆయనకలా యిచ్చినప్పుడు గురువు రుణంలోంచీ విముక్తుడినైన ఆనందం కలిగింది నాకు. ఈ డబ్బిచ్చేసి కనీసం యిలాగేనా రుణవిముక్తుడినవ్వాలనో, యిప్పటికైనా కట్నం తీసుకోని ఆదర్శవాదుల జాబితాలోకి చేరాలనో అనుకున్న నాకు తీవ్రమైన ఆశాభంగం కలిగింది.

''పద్మజా!'' కొంచెం గట్టిగానే పిలిచాననుకుంటా-

''ఏమిటి?'' విసురుగా వచ్చింది జవాబు.

''ఓ మాటిలారా!'' అథార్టీగా పిలిచాను.


వచ్చింది.

''మీ నాన్న చెక్కు తిప్పి పంపించాడు. నీకు కానుకగానట. ఉంచుకో'' కొంచెం వెటకారంగా అని చెక్కు తీసిచ్చాను. వద్దంటుందనుకున్నాను. కానీ అందుకుంది.

''నిజంగానేనా?'' అడిగింది.

కొంచెం ఆశ్చర్యంగా చూసి తలూపాను.

''ఎన్‌క్యాష్ చేసుకోనా?'' మళ్ళీ అడిగింది.




''ఏం చేసుకుంటావు? రవ్వల నెక్లెస్ కొంటావా?'' పరిహాసంగా అడిగాను.

''చెప్తాను'' అంటూ బెడ్రూంలోకి వెళ్ళి సూట్‌కేస్‌తో తిరిగొచ్చింది. అంతసేపూ నేను సస్పెన్స్‌తో సర్కస్ చేసాను. తను గదిలోంచి రాగానే అది విడిపోతుందనుకుంటే చేతిలో యిప్పుడీ సూట్‌కేసు!

''మా నాన్న నిజమే చెప్పాడు. డెబ్బయ్యేనిమిదేళ్ళ వయసులో ఆయనకి కావల్సినది డబ్బుకాదు. ఆదరణ, ఆప్యాయత. అందరం వదిలేస్తే ఆశ్రమంలో వుంటున్న ఆయన దగ్గర కొంత డబ్బు చేరితే అది అల్లుళ్ళ మధ్య కలహాలకి కారణం కావచ్చు.''

''ఐతే?''

''అల్లుడిగా ఆయనపట్ల మీకేమీ బాధ్యత లేదేమోగానీ కూతురిగా నాకు వుంటుందనే ఎప్పుడూ అనుకుంటూ వచ్చాను''

''బాధ్యత లేకపోతేనే ఈ వయసులో వుపయోగపడాలని అంత డబ్బు పంపించావా?''

''అది బాధ్యతకాదు. కట్నం తీసుకున్నానన్న వ్యధో, ఆ డబ్బుతో పైకొచ్చాననే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సో, దాన్నుంచీ బైటపడి ఆయనకన్నా మీరో మెట్టు పైకి చేరడానికి యిచ్చారు. బాధ్యతతో యివ్వడం వేరేలా వుంటుంది'' తన గొంతు పదునుగా వుంది.

యస్.శ్రీదేవి

''అదెలా వుంటుందో, తమరే సెలవివ్వండి'' వళ్ళు మండిపోతుంటే వెటకారంగా అన్నాను.

''అసలది ఎవరి డబ్బు? ఎవరికిచ్చారు?''

''అంటే?!''

''ఆడపిల్లకి పెళ్ళప్పుడు తండ్రి యిచ్చేది స్త్రీధనం. అభిమానం, పౌరుషంగల మగవాళ్ళె వరూ దాన్ని వాడుకోరు. వాడుకున్నా వృద్ధిచేస్తారు. అదెప్పటికీ ఆమెదే. అలాంటి డబ్బుకి కట్నం అనే పేరు పెట్టి, అప్పున్నట్టు తీసుకుని వాడుకుంటున్నారు మగవాళ్ళు. ఆ డబ్బుతో పునాది వేసుకుని ఎదిగి, యిన్నేళ్ళు ఆ ప్రగతిని అనుభవించి, ఈరోజునో లక్ష రూపాయలు వడ్డీతో కలిపి పారేస్తే రుణవిముక్తులవ్వరు ఎవ్వరూ.



అలా తీరిపోయే రుణాలే అయితే ఈ ప్రపంచంలో ఎవరికెవరం ఏమీ కాము''

''చెప్పేదేదో సరిగ్గా ఏడు'' విసురుగా అరిచాను.

''నాకు నచ్చినది ఏ వొక్కటీ చెయ్యటానికి స్వతంత్రంలేని ఈ యింట్లోగానీ, మీకేవి సంతోషం కలిగిస్తాయో, గర్వాన్నిస్తాయో అవేతప్ప నాకు కావాల్సినవి, నేను కోరుకున్నవి ఎప్పుడూ యివ్వాలనుకోని మీలోగానే నాకెలాంటి ఆకర్షణా లేదు..ముఖ్యంగా యిప్పుడు''

''అంటే?'' నా గొంతు నాకే వికృతంగా వినిపించింది.

''నా తండ్రికి ఎంతోకొంత సాయం చెయ్యాలనే తపన నాలో వుండేది.

బేంకులాకర్లో నిరర్థకంగా పడి ఏడుస్తున్న పాతిక తులాల బంగారంలోంచీ ఒక గొలుసు, జతగాజులు పెద్దచెల్లి పెళ్ళికి పెట్టివుంటే మా అమ్మ వంటిమీద నానుతాడు కదిలేది కాదు. గిల్టుగొలుసుతో ఆవిడ, కళ్ళలో నీళ్ళతో అదీ వుంటే ఇంత బంగారం దిగేసుకుని వాళ్ళమధ్యనెలా తిరగ్గలననుకున్నారు? అమ్మకి కేన్సరొస్తే చూసేవాళ్ళు లేక చిన్నదాని పెళ్ళి వాయిదా వేసారు. ఆవిడ పోయాక, ముప్పయ్యైదేళ్ళొచ్చాక దాని పెళ్ళైంది. ఆరోజుల్లో నేనెంత క్షోభపడ్డానో తెలుసా మీకు? మీరెప్పుడూ పట్టించుకోలేదు'' నిలదీస్తున్నట్టు అంది.

''ఎవరిప్రాప్తం ఎలావుంటే అలా జరుగుతుంది'' విసుగ్గా జవాబిచ్చాను.

''అలా వూరుకుని ఎవరి కర్మకి వాళ్ళని వదిలేస్తే సరిపోయేది.

ఈ పరిస్థితుల్లో మా నాన్నకేం కావాలో మీకు తెలుసు. తెలిసీ దాన్ని గుర్తించడానికి మీ అహం వప్పలేదు. పెళ్ళయ్యాక ఆడపిల్లలకి పుట్టింటితో సంబంధం తెగిపోతుందనేది కాలం చెల్లినమాట. అదేనా ఆర్థికసూత్రాలకి సంబంధించినదేమోగానీ అంతరంగాలకీ అనుబంధాలకీ సంబంధించింది కాదు.

మీరు చేసిన పనితో ఎంతోకాలంగా సంఘర్షించి, అలిసిపోయి, వోటమినంగీకరించిన నా అంతరాత్మని నిద్రలేపారు.

నేను మా నాన్న దగ్గరకెళ్తున్నాను. ఆయన వయసుకి ఒక ఎటెండెంట్ వుండచ్చునట. ఆయన ఖర్చులకి పెన్షనుంది. ఇది నాకు వుపయోగపడుతుంది'' అంది.

నేను నిశ్చేష్టుడినైపోయాను.

## ఆనందం

**సినిమా రంగంలోకి కొత్తగా వచ్చినవారికి ఎన్నో ఆశలుంటాయి. తాము ఎంత త్వరగా పెద్ద బ్యానర్ చిత్రంలో నటించి తమ ఇమేజ్‌ని పెంచుకోవాలా అని వారు వేయికళ్లతో ఎదురుచూస్తుంటారు. కొత్త హీరోయిన్ల తాకిడి ఎక్కువై పోయిన ఈరోజుల్లో రెండు సినిమాల తరువాత వారికి ఆఫర్లు తక్కువైపోతున్నాయి. 'స్టూడెంట్ నెంబర్-1'తో యువతని ప్రేమలో పడేసిన గజాలా ఇప్పుడు చాలా బిజీగా ఉంది. సురేష్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'విజయం'లో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. సింగీతం శ్రీనివాస రావు కథ, దర్శకత్వం సమకూరుస్తున్న ఈ సినిమా షూటింగ్ సుందరమైన గోవాలో జరుగుతోంది. మంచి టేస్ట్ ఉన్న సింగీతం సినిమాలో నటించడం తనకెంతో ఆనందంగా ఉందంటోంది గజాలా.**

లెక్కల మాష్టారికి పదివేలు యివ్వటానికీ, పిల్లనిచ్చి నన్నో సంసారీకుణ్ణి చేసిన మామకి లక్ష యిచ్చి రుణవిముక్తుడినవ్వాలనుకోవడానికీ గల తేడా అస్పష్టంగా అర్థమౌతుంటే...

నన్ను ఆ అయోమయంలో అలాగే వదిలేసి వెళ్ళిపోయింది పద్మజ. ఆమె వెళ్ళాక అర్థమైంది... అంచనాలు అప్పుడప్పుడు తప్పుతుంటాయని.

✤